స్కీమ్ వర్కర్లపై 'అధికార' పగ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ అధికార పార్టీ స్కీం వర్కర్లపై పగబడుతోంది. ఓటు తమకు వేయలేదన్న అక్కస్సుతోనూ, ఆయా పోస్టుల్లో తమవారిని నియమించుకోవాలన్న ఆశతోనూ స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులకూ, కక్షలకు దిగుతోంది. ఫలితంగా పలువురు స్కీం వర్కర్లు తమ చిరు ఉద్యోగాలను కోల్పోతుండగా.. ఇంకొందరు తీవ్ర మనోవేదనకు గురవుతూ మంచాన పడుతున్నారు. దీంతో ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ తమకీ రాజకీయ వేధింపులు తప్పవా అంటూ స్కీం వర్కర్లు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ ఏడాది జూన్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎప్పటిలాగే యధావిధిగా స్కీం వర్కర్ల పరిధిలోకి వచ్చే అంగన్వాడీలు, మినీ అంగన్వాడీలు, అంగన్వాడి ఆయాలు, సంఘమిత్రలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, పాఠశాలల ఆయాలపై అధికార, రాజకీయ వేధింపులు షురూ అయ్యాయి. ఇప్పటికే శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పలువురు సంఘమిత్రలు, ఫీల్డ్ అసిస్టెంట్లపై వేటు పడ్డట్లు సమాచారం. అదేవిధంగా పలువురు అంగన్వాడీలు, పాఠశాలల్లో పనిచేసే ఆయాలపై వేటు వేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు అధికారులు కూడా సహకరిస్తుండడంతో స్కీమ్ వర్కర్ల వేదన వర్ణనాతీతమనే చెప్పాలి.

ఇప్పటికే పలువురిపై వేటు!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండు నెలలు కావస్తోంది. ఈ రెండు నెలల కాలంలోనే అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు శ్రీకాళహస్తి మండలంలో 11 మంది క్షేత్ర సహాయకులను తొలగించినట్లు సమాచారం. అయితే వీరిలో ఏడుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వం మారగానే స్వచ్ఛందంగానే రాజీనామాలు చేసినట్లు ఉపాధి హామీ ఎపిఓ చెబుతుండటం గమనార్హం. పుల్లారెడ్డి కండిగలో క్షేత్ర సహాయకుని తొలగించేందుకు ఆగస్టు 3న రంగం సిద్ధం చేశారని తెలిసింది. అదేవిధంగా శ్రీకాళహస్తి మండలంలోని మన్నవరం పంచాయతీలో ఓ అంగన్వాడి కార్యకర్త, ఎంపేడు అంగన్వాడి కార్యకర్తపై వేటువేయాలని రాజకీయ ఒత్తిళ్ళు మొదలైన సంగతి అందరికీ తెలిసిందే. అదేవిధంగా శ్రీకాళహస్తి మండలంలో ఏడుగురు సంఘమిత్రలను తొలగించేందుకు రాజకీయంగా రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. తొట్టంబేడు మండలంలో ఇద్దరు క్షేత్ర సహాయకులను తొలగించినట్లు తెలిసింది. 11 మంది సంఘమిత్రలను తొలగించేందుకు రంగం సిద్ధమైంది. తొట్టంబేడు మండలంలోని బోనపల్లి దళితవాడలో అంగన్వాడి ఆయా ఇంటికి అధికారి పార్టీ నేత ఒకరు వచ్చి మర్యాదగా తొలగిపోవాలని హెచ్చరించి వెళ్లడం స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులకు నిదర్శనంగా నిలుస్తుంది. ఇటీవల శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో వేరొక పార్టీకి ఓటు వేశారని అక్కస్సులో ప్రభాకర్, లోకనాథం, భువనేశ్వరి అనే పారిశుద్ధ్య విభాగం కార్మికులను తొలగించిన సంఘటన చోటు చేసుకుంది.

రాజకీయ కక్షతో పలువురిపై వేటు

నేడు స్కీం వర్కర్ల ధర్నా

శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట బుధవారం ఉదయం 10.30 గంటలకు సిఐటియు అనుబంధ సంఘాల స్కీం వర్కర్లు అధికార, రాజకీయ వేధింపులకు వ్యతిరేకంగా ధర్నా చేపట్టనున్నారని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఒకలా.. అధికారంలో మరోలా వ్యవహరిస్తున్న కూటమినేతల తీరు తీవ్ర ఆక్షేపణీయమని తెలిపారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న స్కీమ్ వర్కర్లకు ఎర్ర జెండా అండ ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు.

మాట తప్పిన కూటమి నేత

ఈ ఏడాది మొదట్లో తమ న్యాయపరమైన హక్కుల సాధన కోసం, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు కోసం వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్కీం వర్కర్లు పెద్ద ఎత్తున ఆందోళన బాట పట్టారు. దాదాపు నెలకు పైగా విధులకు గైర్హాజరై తమ నిరసన గళాన్ని వినిపించారు. ఈ నేపథ్యంలో నిరసనలో పాల్గొన్న స్కీమ్ వర్కర్లపై గత వైసిపి ప్రభుత్వం ఎస్మా ప్రయోగించింది. ఈ క్రమంలో శ్రీకాళహస్తిలో కూటమినేత, ఆయన కుటుంబం పెద్ద ఎత్తున స్కీం వర్కర్ల సమ్మెకు సంఘీభావం తెలియజేసింది. సమ్మెకు మద్దతుగా దీక్షలో పాల్గొంది. సమ్మెలో పాల్గొంటున్న అంగన్వాడి కార్యకర్తలకు, ఆయాలకు, మున్సిపల్ కార్మికులకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్కీం వర్కర్లను రెగ్యులరైజ్ చేస్తామనీ, వారి న్యాయపరమైన డిమాండ్లన్నిటినీ పరిష్కరిస్తామనీ, మరీ ముఖ్యంగా స్కీం వర్కర్లకు రాజకీయ వేధింపులు లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ కూటమినేత ఆ మాటను మరిచినట్లున్నారు.

తీరు మారాలి :పెనగడం గురవయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

అధికారం మారినప్పుడల్లా స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు మొదలుపెట్టడం బాధాకరం. రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలి. అలాకాకుండా చిరుద్యోగులపై రాజకీయాలు చేయడం సిగ్గుచేటు. రాజకీయ నాయకులకు సహకరిస్తున్న అధికారుల తీరు మారాలి.

ఉమ్మడి జిల్లాకు రూ.300 కోట్లు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

రాష్ట్రంలోని వెనుకబడి ఏడు జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీని ఇస్తామని కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రూ.300 కోట్లు నిధులు రానున్నాయి. చిత్తూరు జిల్లాకు 150 కోట్లు, తిరుపతి జిల్లాకు రూ.150 కోట్లు కలిపి కేంద్రంనుంచి రానున్నాయి. వీటితోపాటు ఇటీవల ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నీతిఅయోగ్ సమావేశంలో పాల్గొని నిధులు త్వరగా ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కేంద్ర సహాయ మంత్రి పంకజ్‌చౌదరి నీతిఅయోగ్ సిఫార్సుల మేరకు ఎపిలో వెనుకబడిన ఏడు జిల్లాలకు 2,100 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించారు. ఈ నిధులను రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వసతి తదితర మౌలిక సదుపాయాలకు వినియోగించనున్నారు.

పెద్దిరెడ్డి తరువాత రోజానే టార్గెట్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మదనపల్లి సబ్‌కలెక్టరేట్ దగ్ధం కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పూర్తిగా ఇరుక్కుంటున్నారు. ఇప్పటికే ఆ ఘటనలో పెద్దిరెడ్డికి అనుకూలంగా వ్యవహరించిన ఇద్దరు ప్రభుత్వ అధికారులపై వేటు పడింది. అలాగే తంబళ్లపల్లి, మదనపల్లి ఎంఎల్‌ఎలపైన కేసులు నమోదయ్యాయి. దాదాపు 950 కోట్ల పైగా విలువ చేసే భూ ఆక్రమణల్లో పేదలే సమిథలు. మదనపల్లి ఘటన జరగడంతో స్వయంగా బాధితులైన పేదలు పెద్దిరెడ్డి అనుచరులు గత ఐదేళ్లలో చేసిన అరాచకాలను చెప్పుకునేందుకు విచారణ అధికారుల ముందు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ శాఖలను అడ్డు పెట్టుకుని పెద్దిరెడ్డి భూములను, ఖనిజాలను ఏ విధంగా కొల్లగొట్టింది నివేదిస్తున్నారు. ఈ నివేదికల ఆధారంగా పెద్దిరెడ్డిపై కేసులు నడవనున్నాయి. పుంగనూరు ఘటనలోనూ పెద్దిరెడ్డి మెడకు మరిన్ని చుట్టుకోనున్నాయి. ఈ భూఆక్రమణల కేసులో పిఎల్ఆర్ గ్రాంట్స్‌లో పనిచేస్తున్న కొంతమందిని దుబాయ్, ఆఫ్రికా దేశాలకు పాస్‌పోర్టులు ఇచ్చి పంపించినట్లు ప్రభుత్వం దృష్టిలో ఉంది. ఈ ఘటన ఓ కొలిక్కి వచ్చిన తరువాత మాజీ మంత్రి ఆర్‌కె రోజాపైనా అధికార పార్టీ కేంద్రీకరించనుంది. ఈ ఐదేళ్ల కాలంలో దోచుకున్న వైనాన్ని ప్రభుత్వం ఆరా తీస్తోంది. ముఖ్యంగా నగరి నియోజకవర్గంలో ప్రతి శాఖలోనూ ఆమె చేతివాటం ఉందన్న విమర్శలున్నాయి. ముఖ్యంగా తిరుమల శ్రీవారి దర్శనాల్లో కోట్ల రూపాయలు సంపాదించారన్నది ఆమెపై ఉన్న ప్రధాన ఆరోపణ. మంత్రిగా ఉన్నపుడు నోటి దురుసుతనంతో చంద్రబాబు, పవన్, లోకేష్‌లపై ఘాటుగా విమర్శలు చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసిపి ప్రధాన నాయకత్వంపైన టార్గెట్ పెట్టుకున్న నేపథ్యంలో ఆర్‌కె రోజా చెన్నయ్‌లో సెటిలై ఇంటికే పరిమితమైనట్లు తెలుస్తోంది. తొలుత తిరుమల సిఫార్సు లేఖల లెక్కలు తీయనుంది.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్‌కు సిపిఎం వినతి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: జిల్లాలో ఉన్న కార్మిక, ప్రజా సమస్యలు పరిష్కారం చేయాలని మంగళవారం కలెక్టర్ సుమిత్ కుమార్‌కి సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పం అంగన్వాడి సిడిపిఓ కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కి అంగన్వాడీ పోస్టులుకు అప్లై చేసిన అప్లికేషన్లు జిల్లాకు చేర్చుకోవడం దారుణమని, అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కోసం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం వెంటనే జరపాలని విజ్ఞప్తి చేశారు. పుంగనూరు పాలెం పరిధిలో ఉన్న క్వారీ, గ్రానైట్ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. జిల్లాలో ఉన్న తిరుమల డెయిరీ, దొడ్ల డెయిరీ, సంఘం డెయిరీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. గొర్రెల, మేకల పెంపకం దారుల జిల్లా సహకార సంఘంలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం పని చేసిన కార్మికులకు బకాయి కూలి ఇవ్వాలని, అన్ని మండలాల్లో పని అమలు చేయాలని, నగరి పవర్లూమ్ కార్మికులు పోరాటం చేసి సాధించుకున్న కూలి రేట్లు అమలు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు పరిష్కారానికి కృషి చేయనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ హామీ ఇచ్చారు.

పార్కు పనులు వేగవంతం చేయండి

- కమిషనర్ డాక్టర్ జె.అరుణ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్:

నగరంలో మిట్టూరులోని మునిస్వామి నాయుడు మున్సిపల్ పార్కులో నిర్దేశించిన పనులను వేగవంతం చేయాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ పార్కును సందర్శించారు. అట వస్తువులు, ప్రహరీ, వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. ప్రహరీకి రంగులు వేయాలని, ఆట వస్తువులకు మరమ్మత్తుల పూర్తి చేసి, పెయింటింగ్ వేసి వినియోగానికి సిద్ధం చేయాలన్నారు. పూర్తిస్థాయిలో లైటింగ్ ఉండాలన్నారు. పార్కులో షటిల్ కోర్టు నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. నిర్దేశించిన అభివృద్ధి పనులను సత్వరం ప్రారంభించి వేగవంతం చేయాలన్నారు. మిగిలిన పనులకు అంచనాల రూపొందించి సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పార్కు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ రమణ, ఏఈ లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ అమర్నాథ్ రెడ్డి, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమమే ధ్యేయం: ఎంపీ దగ్గుమళ్ళ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్:

అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వ కృషి చేస్తోందని, అందులో భాగంగా రాజముద్రతో పాసుపుస్తకాల నమూనాను సీఎం చంద్రబాబు విడుదల చేయడం హర్షనీయమని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నదాతల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఏపీ ప్రభుత్వ రాజ్యముద్రతో కూడిన పాసు పుస్తకాలను త్వరలో రైతన్నలకు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని ఎంపీ ప్రకటనలో స్పష్టం చేశారు. గత వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ భ్రష్టుపట్టాయని.. వాటినన్నిటిని సరిదిద్ది.. ఏపీ ప్రజలకు సుపరిపాలన అందించే దిశగా కూటమి సర్కార్ అడుగులేస్తోందన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నేతృత్వంలో తామంతా సేవకులుగా పనిచేస్తున్నామని వివరించారు.

స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: స్థానిక ఒరిగిపల్లిలోని పీఈఎస్ పబ్లిక్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న షణ్ముఖ ఠాకూర్ ఇటీవల విశాఖ పట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-11 రోల్ బాల్ స్కేటింగ్ కాంపిటీషన్లో విన్నర్ ఛాంపి యన్షిప్‌ను సొంతం చేసుకున్నాడు. అలాగే 4వ తరగతికి చెందిన జార్విత రోల్ బాల్ స్కేటింగ్ కాంపిటీషన్లో రన్నరప్‌గా నిలిచింది. ఈ సంద ర్భంగా పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపల్ వై.వి. కృష్ణ బాబు మాట్లాడుతూ చదువుతో పాటు అన్ని రంగాల్లోనూ గొప్పగా అభివృద్ధి సాధించాలంటూ, శిక్షణ ఇచ్చిన శిక్షకులకు, తల్లిదండ్రులకు, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఈవిఎం గోడౌన్ పరిశీలన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరులోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద ఉన్న సీసీ కెమెరాల నిఘాతో పాటు పటిష్ట భద్రత ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌వో బి.పుల్లయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధుల తరపున బిజెపి-అట్లూరి శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శి గంగరాజు, వైసీపీ ఉదయ్, బీఎస్పి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్, యంత్రాంగం

మానవ అక్రమ రవాణాను అరికట్టాలని సీనియర్ న్యాయవాది మురగేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా దినోత్సవం పురస్కరించుకుని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సి రాఘవేంద్ర ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. పిల్లలు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పరిరక్షణలో ఉండాలన్నారు. పిల్లలు ఏదైనా సమస్యలు ఎదుర్కొన్నపుడు 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. పిల్లల్ని ఒంటరిగా బయటకు పంపకూడదన్నారు. ప్రిన్సిపల్ శేషగిరి మాట్లాడుతూ పిల్లలు ఏడుతరం అనే పుస్తకాన్ని చదవాలని సూచించారు. తిరుపతి కలెక్టరేట్ ఎదుట వాక్ ఫర్ ఫ్రీడం గ్రామ జ్యోతి వారి సౌజన్యంతో ప్రపంచ మానవ అక్రమ రవాణా నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించి, ర్యాలీ నిర్వహించారు. అమరనాథ్ మాట్లాడుతూ బాలలు, యువతలు, మహిళలు రవాణా సమయంలో గానీ, పనిచేసే ప్రదేశాల్లో గానీ హింసకు గురైతే బలవంతపు తరలింపుకు గురికాకుండా ప్రతి మానవుని హక్కును కాపాడాలన్నారు. చందమామల కోటయ్య, పి.వెంకటేష్, కె.శివ, ఎం.నాగరత్న పాల్గొన్నారు. ఏర్పేడులో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. పత్తిపుత్తూరు జడ్‌పి హైస్కూల్, కందాడ జడ్‌పి హైస్కూల్, బండారపల్లి జడ్‌పి హైస్కూల్, ఓబులాయపల్లి జడ్‌పి హైస్కూల్లో కార్యక్రమాలను నిర్వహించారు. సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ చైల్డ్ ట్రాపింగ్ అనేది జుగుప్సాకరమైన నేరమన్నారు. హెడ్‌కానిస్టేబుల్ రమేష్ చట్టాల గురించి, టోల్‌ఫ్రీ నంబర్ల గురించి వివరించారు. ఓబులాయపల్లి పంచాయతీ జిల్లా పరిషత్ పాఠవాలలో శ్రీకాళహస్తి మండల విద్యాశాఖ అధికారిణి ఆర్.భువనేశ్వరి పాల్గొనానరు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ డైరెక్టర్ కె.వి రమణ పాల్గొన్నారు.

జంప్ రోప్ పోటీలలో మంగళం ట్రెండ్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్ విద్యార్థులు రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.కేశవుల నాయుడు తెలిపారు. రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలలో మంగళం ట్రెండ్స్ విద్యార్థులు ఏడు బంగారు పతకాలు, మూడు వెండి పతకాలు మూడు కాంస్య పథకాలను సాధించారన్నారు. తిరుపతి జిల్లా ఓవరాల్ ఛాంపియన్షిప్ సాధించుటలో మంగళం ట్రెండ్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారన్నారు. మంగళవారం ఉదయం జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రామకృష్ణ, సాంబశివరావు, ఉపాధ్యాయులు కృష్ణమ నాయుడు, చంద్రశేఖరయ్య ప్రత్యేకంగా అభినందించారు. ఆగస్టులో మహారాష్ట్రలోని నాందేడ్ లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

జాతీయ జంప్ రోప్ పోటీలకు బిసిఎం విద్యార్థులు

రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీలలో మంగళం పరిధిలోని బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్ (బిసిఎం)విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరచి జాతీయస్థాయి జంప్ రోప్ పోటీలకు ఎనిమిది మంది బిసీఎం విద్యార్థులు ఎంపికవ్వడం చాలా సంతోషంగా ఉందని పాఠశాల వ్యవస్థాపకులు కష్ణమూర్తి నాయుడు తెలిపారు. ఈనెల 27,28 తేదీల్లో నంద్యాలలో రాష్ట్రస్థాయి జంప్ రోప్ పోటీల్లో జాతీయస్థాయి జంప్ రోప్ పోటీలకు బిసిఎం పాఠశాల నుండి 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రియా మాట్లాడుతూ పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించి వారికి ఉపయుక్తంగా ఉండే క్రీడలను పాఠశాలలో నేర్పిస్తున్నామన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య, పిఈటి ప్రమీన, ప్రత్యేకంగా అభినందించారు.

అరవింద్ కేజ్రీవాల్న్ తక్షణం విడుదల చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్న్ తక్షణం విడుదల చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ, ఇండియా ఫోరం నేతలు డిమాండ్ చేశారు. ఆప్ జాతీయ కమిటీ పిలుపు మేరకు తిరుపతి బస్టాండ్ సమీపంలోని బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ బిజెపి రాజకీయ కక్షతో నిర్బంధించడం హేయమైన చర్యన్నారు. కోర్టులో బెయిన్ ఇచ్చినా నిరంకుశంగా దర్యాప్తు సంస్థలైన సిబిఐ, ఈడీలను దుర్వినియోగం చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. కేజ్రీవాల్ ఆరోగ్య సమస్యలతో దినదినం క్షీణించడం చూస్తుంటే బిజెపి చంపాలని కుట్ర చేస్తుందన్న అనుమానం కలుగుతుందన్నారు. తక్షణమే ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకుని కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ జిల్లా అధ్యక్షులు నీరుగట్టు నగేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట చలపతి, రాష్ట్ర కార్యదర్శి కల్లూరి బాలసుబ్రమణ్యం, రాష్ట్ర అధికార ప్రతినిధి కోడివాక చందు, ఇండియా ఫోరం నాయకులు మాగంటి గోపాల్‌రెడ్డి, పి.మురళి, సుబ్రమణ్యం, మాధవక్రిష్ణ పాల్గొన్నారు.

డాయ్ యాప్ విచారణ పూర్తి

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరులో డాయ్ యాప్ విచారణ మంగళవారంతో ముగిసింది. విచారణ కమిటీలో పలమనేరు సిఐ చంద్రశేఖర్, చిత్తూరు మెప్మా పీడీ రాధమ్మ వ్యవహరించారు. బాధితుల నుండి వినతులను స్వీకరించి జరిగిన మోసం గురించి ఆరా తీశారు. ఇందులో 373మంది బాధితులు దాదాపు రూ.6 కోట్ల ఆరు లక్షలు మోసపోయినట్లు తేలిందని అధికారులు చెప్పారు. ఇందులో ముఖ్య సూత్రధారి మెప్మాలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్ రాజేష్, మెప్మాలో పనిచేస్తున్న ఆర్పీలు ఉన్నట్లు నిర్ధారించారు. వీరంతా అధిక ఆదాయం వస్తుందనే అత్యాశతో ఈ ఆన్లైన్ ఆప్‌లో డబ్బులు మోసపోయినట్లు తెలిపారు.

కుప్పం వైసిపి ఇన్‌ఛార్జిగా పెద్దిరెడ్డి సుధీర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: టిడిపిని రాజకీయంగా ఎదుర్కొనేందుకు వైసిపి సిద్ధమవుతోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో చంద్రబాబుపై పోటీచేసి ఘోర ఓటమిని చవిచూసిన ఎంఎల్‌సి భరత్‌ను పక్కన పెట్టి, ఆయన స్థానంలో పెద్దిరెడ్డి తమ్ముని కొడుకు సుధీర్‌రెడ్డిని నియమించేందుకు కసరత్తు చేస్తోంది. ఎన్నికలు ముగిసాక టిడిపి దాడుల నుంచి కార్యకర్తలకు భరోసా ఇవ్వకుండా పరారైన భరత్ ను పూర్తిస్థాయిలో వైసిపి నుంచి పక్కన పెట్టాలని జగన్ చూస్తున్నట్లు సమాచారం. ఇటీవల కుప్పంలో వైసిపి కార్యకర్తలను టిడిపివారు ఇంటికెళ్లి దౌర్జన్యం చేయడం, భౌతికంగా దాడులు చేశారు. అయితే భరత్ కనీసం కార్యకర్తలకు భరోసా ఇవ్వలేకపోయారన్నది వైసిపి కార్యకర్తల ఆరోపణ. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దగ్గరకు వెళ్లి వారు వాపోయినట్లు సమాచారం. 'మీరు చెబితేనే కదా మేం ఐదేళ్లు ధైర్యంగా నిలబడి చంద్రబాబును సైతం లెక్కచేయకుండా ఆందోళనలు చేశాం. స్థానిక ఎన్నికల్లోనూ అన్ని స్థానాల ఏకగ్రీవానికి ప్రయత్నించాం. ప్రస్తుతం మా పరిస్థితి ఏంటి.. టిడిపివారు దాడులు చేస్తుంటే ఇబ్బందులు పడాలా' అని పెద్దిరెడ్డి చెంత బాధపడ్డారు. అయితే పెద్దిరెడ్డి సైతం తమస్థాయిలోనూ అధికార పార్టీ నుంచి భారీగా దాడులు జరుగుతున్నాయని, కుప్పం కార్యకర్తలను ఆదుకునే బాధ్యత తనదేనని, తన తమ్ముని కుమారుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని భరోసా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సైతం సుముఖత వ్యక్తం చేసి జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. త్వరలోనే సుధీర్‌రెడ్డి ని ఇన్‌ఛార్జిగా నియమించే అవకాశం ఉంది.

ఎస్సీ కార్పొరేషన్‌ను వెంటనే ప్రారంభించాలి : చింతామోహన్

గూడూరు టౌన్ : ఎస్సీ కార్పొరేషన్‌ను వెంటనే ప్రారంభించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. గూడూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్లను ఇందిరా గాంధీ హయాంలో ప్రారంభించామని, అవి నేడు మూతబడ్డాయన్నారు. వైసిపి హయాంలో ఎస్సీ కార్పొరేషన్లు నిర్వీర్యం అయ్యాయన్నారు. ఇండి యా కూటమికి జగన్మోహన్‌రెడ్డి అవసరం ఏమా త్రం లేదన్నారు. సొంత చెల్లే ప్రతిరోజూ జగన్మో హన్‌రెడ్డిని విమర్శలు చేస్తోందన్నారు. నాయకు లు డాక్టర్ రామకృష్ణరావు, పూల చంద్రశేఖర్, నాగభూషణం, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

డిఆర్‌ఎంను కలిసిన రైల్వే పెన్షనర్స్ ఉద్యోగులు

ప్రజాశక్తి -రేణిగుంట: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంతకల్లు డిఆర్ఎం విజయ్ కుమార్‌కు, సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి జయశంకర్ చౌహాన్‌కు రైల్వే పెన్షనర్స్ ఉద్యోగులు మంగళవారం పలు సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. అసోసియేట్ సెక్రటరీ జయంత్‌కుమార్ మాట్లాడుతూ పే కమిషన్ తరువాత ఇవ్వాల్సిన పెన్షన్ పే ఆర్డర్లను ఏర్పాటు చేయాలన్నారు. మెడికల్ కార్డులు ఇవ్వాలన్నారు. అరవింద్, అగర్వాల్ కంటి ఆస్పత్రులకు రైల్వే ఉద్యోగులకు, పెన్షనర్లకు రిఫరల్ ఆస్పత్రిగా ఏర్పాటు చేయాలన్నారు. రేణిగుంట సంతగేటు దగ్గర ఉన్న గేటు కింద బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి ఛైర్మన్ ఎస్.అసన్ సాహెబ్, పంచాయతీ ప్రెసిడెంట్ ఆర్.నాగేశం, బ్రాంచి కార్యవర్గ సభ్యులు ఆర్ఎస్ జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.

పల్లెను సందర్శించి.. భరోసానిచ్చి..!

- పాయలగుట్టలో సమస్యలపై అధికారుల ఫోకస్
- కావలసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్న ఈవోఆర్‌డీ
- మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తామని హామీ
- ప్రజాశక్తి కథనంతో మారుమూల పల్లె కష్టాలు వెలుగులోకి..

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఈవోఆర్‌డీ లక్ష్మీదేవి

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీలోని పాయలగుట్ట అన్నది ఓ కుగ్రామం. అక్కడ నిరుపేద కుటుంబాలు బతుకెళ్లదీస్తున్నాయి. చిన్నపాటి ఎస్టీ కాలనీలో సుమారు 20ఏళ్లప్పుడు ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేసింది. అప్పటి గుత్తేదారు నొక్కుడు కారణంగా ఆ నివాసాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కాలనీలో ఇబ్బడిముబ్బడిగా సమస్యలు నెలకొన్నాయి. ప్రతి ఏటా ఫిబ్రవరి నెలలో ఠంఛన్‌గా ఇంటి పన్ను చెల్లించే వారే అక్కడంతా.. అయినా సౌకర్యాల లేమి, అధికారుల పట్టించుకోకపోవడంతో చిమ్మచీకటి, వర్షమొస్తే తడిచే ఇండ్లు, తాగునీరు రాక, వైద్య సేవలకు దూరంగా ఉండి బతుకెళ్లదీస్తూ వచ్చారు. కాగా ప్రజాశక్తి ఆదివారం ఆ గ్రామాన్ని సందర్శించింది. అక్కడి ప్రజల కష్టాలను సిరాక్షరాలుగా మలచి ఇబ్బందులను 'పాయలగుట్ట సమస్యల తిష్ట' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన అధికారులు సోమవారం హౌసింగ్ ఏఈ, పంచాయతీ రాజ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు ఆ గ్రామాన్ని సందర్శించారు. మంగళవారం ఈవోపీఆర్‌డీ లక్ష్మీదేవి, పంచాయతీ కార్యదర్శి మేనక, సచివాలయ సిబ్బంది పాయలగుట్టకు చేరుకున్నారు. అక్కడి పరిస్థితులను ఆరాదీశారు. ప్రజల కష్టాలను అతిదగ్గరగా ఆలకించారు. తాగునీటి బోరులో మరమ్మతులు చేయించి సింథటిక్ ట్యాంకు ఏర్పాటు చేసి తద్వారా ఇంటింటికీ నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపి తక్షణ చర్యలు చేపడతామని ఈవోఆర్‌డీ తెలిపారు. గ్రామంలో వీధి దీపాల ఏర్పాటుకు వెంటనే చర్యలు చేపడతామన్నారు.

ప్రజాశక్తికి అభినందనలు..

సర్కార్ సేవలకు దూరంగా.. సమస్యలకు అతి దగ్గరగా జీవనం సాగిస్తున్న ఆ గ్రామస్తుల కష్టాలు వెలుగులోకి తీసుకొచ్చిన ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు. ఇకనైనా అధికారులు తమ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరారు.

పేదల గోడు పట్టని రెవెన్యూ..

కాయకష్టం చేసుకొని రోజంతా కూలీ చేసుకొని జీవనం సాగిస్తున్న పాయలగుట్ట వాసుల గోడును రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ, ఇతర పనులకు వెళ్లి పూట గడుపు తున్న కష్టజీవులే వారంతా.. నెలకొసారి ఇచ్చే రేషన్ బియ్యం వండి తిని, అంత కడుపునింపుకొనే పరిస్థితి. శ్మశాన స్థలం లేక.. పంట భూములు లేక ఇబ్బంది పడుతున్న ఆ గ్రామస్తుల గోడు రెవెన్యూ అధికారులకు పట్టడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. శ్మశాన స్థలాన్ని కేటాయించి భూ పంపిణీలో భూములు కేటాయించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

వైద్య శిబిరం..

ప్రజాశక్తి వార్తకు స్పందించిన వైద్యాధికారులు మంగళవారం ఇరికిపెంట పంచాయతీ పాయలగుట్ట ఎస్టీ కాలనీలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు, మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్‌రెడ్డి తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై అక్కడి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ అమర్నాథ్, మలేరియా అధికారి గంగయ్య, ఆశా కార్యకర్త గుణవతి పాల్గొన్నారు.

పాయలగుట్ట గ్రామంలో వైద్య శిబిరం

దేశ భవిష్యత్తును నిర్ణయించేది విద్యార్థులే

- 117 జిఓపై అసెంబ్లీలో చర్చిస్తాం
- విద్యా సామగ్రి పంపిణీలో ఎమ్మెల్యే థామస్

విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కార్వేటినగరం: దేశ భవిష్యత్తును నిర్ణయించేది విద్యార్థులే అని ఎమ్మెల్యే డాక్టర్ విఎం థామస్ అన్నారు. కార్వేటినగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విద్యా సామగ్రి కిట్లు పంపిణీ కార్యక్రమన్నికి ఎంఈవో విజయకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులందరూ చక్కగా చదువుకొని ఐఎఎస్, డాక్టర్లుగా ఇంజినీర్లుగా, సైంటిస్టులుగా కావాలని పిలుపునిచ్చారు. తానూ అదే పాఠశాలలో చదువుకున్నట్లు గుర్తు చేశారు. కార్వేటినగరం ఉపాధ్యాయులకు పుట్టినిల్లు అని వివరించారు. బాలికల ఉన్నత పాఠశాలలో ప్లస్-1, ప్లస్-2 తరగతుల విద్యార్థులకు వసతి ఏర్పాటు చేయలని ఎంఈవో విజయకుమార్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దింతో ఎమ్మెల్యే స్పందిస్తూ విద్యశాఖ మంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు కిరణ్, గురుమూర్తి, రాబర్ట్, హేమాచంద్ర రెడ్డి, దొరబాబులు 117 జిఓను రద్దు చేస్తే ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సంఖ్య పెరుగుతుందని ఎమ్మెల్యేకి తెలిపారు. ఉపాధ్యాయ సమస్య పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉన్నారని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం విద్యార్థులకు విద్య సామాగ్రిని కిట్లను పంపిణి చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ చేస్తే మంచి ఫలితాలు వస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన జీడి నెల్లూరు ఇన్‌ఛార్జ్ పొన్న యుగంధర్, టీడీపీ నాయకులు చెంగలరాయల్ యాదవ్, సర్పంచ్ ధనంజయ్ వర్మ, రవి యాదవ్, యువరాజ్, హెచ్‌ఎం కోటేశ్వర రావు, ఎంఈఓ మనోజ్ కుమార్, నాయకులు రాజశేఖర్, వాసుదేవరెడ్డి, రమేష్, గణేష్ కృష్ణయ్య పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో 'శుభదిన్'

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని శ్రీహరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం శుభదినం కార్యక్రమంలో భాగంగా తిది భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల పూర్వ విద్యార్థి దాత వి.చెంచురాజు ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్వీట్స్ పంపిణీ చేశారు. దాత చెంచురాజు గతంలో పాఠశాల అభివృద్ధికి చేయూత అందించారని ఆయన సేవలు అభినందనీయమని హెచ్‌ఎం జ్ఞాన ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు నరేష్, సురేష్, జయరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాలకు చేరిన పుస్తకాలు

ప్రజాశక్తి-సోమల: సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు విద్యాశాఖ ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందజేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు తెలిపారు. కళాశాలలో చదువుతున్న 200మంది విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలు కళాశాలకు చేరాయని, బ్యాగులు కూడా వచ్చాయని విద్యార్థులకు త్వరలో పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు.

ఆర్‌ఎంపి హాస్పిటల్ తనిఖీ

ఆర్‌ఎంపి క్లీనిక్‌ను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో పలు ఆర్‌ఎంపి క్లినిక్‌లను డిఎంహెచ్‌వో ప్రభావతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆర్‌ఎంపి క్లీనిక్స్‌లో అధిక మోతాదులో ఇంజక్షన్స్, సెలైన్, లాంటి వాటితో చికిత్స చేయరాదని అలా చికిత్స చేసే క్లినిక్లను సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది డాక్టర్లు అవతారమెత్తి వైద్యం నిర్వహిస్తున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చికిత్స సెంటర్ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను తనిఖీ చేసి సిబ్బంది అందరూ 9-4గంటల సమయం అందుబాటులో ఉండి సేవలు అందించాలని తెలిపారు. అత్యవసర కేసులను జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు షురూ..

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని లక్కనపల్లి పంచాయతీలో డ్రైనేజీ పేరుకుపోయిందని, పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని ఆ గ్రామస్తులు సోమవారం గ్రామ పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు మంగళవారం పంచాయతీ సిబ్బందిని పురమాయించారు. పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం దగ్గరుండి డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయించారు.

చిత్తూరు బాలుడి అరుదైన ఘనత

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చిత్తూరు నగరానికి చెందిన రెండేళ్ల బాలుడు శరణ్ స్థానం సంపాదించాడు. చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లికి చెందిన స్వరూప్, ప్రియాంక దంపతుల కుమారుడు.. శరణ్ ఒక సంవత్సరం 9నెల వయసు ఉన్నప్పుడు.. 50 మీటర్ల పరుగు పందెంను 28 సెకండ్లలో పూర్తిచేసి గతంలో నెలకొల్పిన రికార్డును అధిగమించాడు. ఈ వీడియోను తల్లిదండ్రులు రికార్డ్ చేసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారికి దరఖాస్తు కోసం పంపారు. దరఖాస్తు పరిశీలించిన ఆ సంస్థ బాలుడు రికార్డును నమోదు చేసినట్లు అందుకు సంబంధించిన ధృవ్రతాన్ని తల్లిదండ్రులకు పంపారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ చిన్నవయసులో తమ బిడ్డ ఈ ఘనత సాధించడం.. తమకెంతో ఆనందాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి-సోమల: మండలంలోని లే అవుట్‌లలో నిర్మాణంలో ఉన్న ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసే విధంగా హౌసింగ్ సిబ్బంది చర్యలు చేపట్టాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మనాభం ఆదేశించారు. డిసెంబర్ నెలాఖరు లోపు పనులు పూర్తిచేసి లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకునే విధంగా వారికి తోడ్పాటు అందించాలని సూచించారు. మంగళవారం సోమల సమీపంలోని జగనన్న లేఅవుట్లో ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అంతకుముందు హౌసింగ్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఇప్పటి వరకు 1900గృహ నిర్మాణాలు పూర్తి అయ్యాయని ఇంకా 150ఇండ్ల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయని వీటిని డిసెంబర్ నెలలోపు పూర్తి అయ్యే విధంగా సిబ్బంది వేగవంతం చేయాలన్నారు. బాత్రూమ్‌లను కూడా లబ్ధిదారులు నిర్మించుకునే విధంగా వారికి తెలిపాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ జవిద్ ఆలి, వర్క్ ఇన్స్పెక్టర్ గణేష్, కంప్యూటర్ ఆపరేటర్ పరహాన పాల్గొన్నారు.

వారపు సంతలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

నిరుపయోగంగా మరుగుదొడ్లు

- ప్రారంభించకనే శిథిలావస్థకు చేరిన వైనం
- అందుబాటులోకి తీసుకురావాలంటున్న స్థానికులు

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని వారపు సంతలో రెండున్నర సంవత్సరం క్రితం నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. ప్రారంభించకనే శిథిలావస్థకు చేరుకున్నాయి. తలుపులు స్థానభ్రంశం చెంది, లోపలి పైపులు పగిలి, టాయిలెట్ షింక్ అపరిశుభ్రంగా మారి శిథిలావస్థకు చేరుకుంటోంది. తలుపులు ఊడిపోయి, గోడలు నెర్రెలు వదిలి లోపలి టాయిలెట్ బేసిన్ కూడా పగిలిపోయి ఉంది. ప్రజా సౌకర్యం కోసం నిర్మించిన మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంగా పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్‌ను వివరణ కోరగా రూ.లక్ష 20వేలతో పంచాయతీ నిధులు వెచ్చించి మరుగుదొడ్లు నిర్మించినట్లు తెలిపారు. పైప్ లైన్ ఏర్పాటు చేసి నీటి కనెక్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. అయితే మరుగుదొడ్ల వద్ద నిర్మించిన అండర్ గ్రౌండ్ ట్యాంక్‌లో నుంచి మరుగుదొడ్లపై ఏర్పాటు చేసిన సింథటిక్ ట్యాంకుకు నీటిని సరఫరా చేయాలంటే మోటారు పెట్టి పంపు చేయాల్సి ఉందన్నారు. విద్యుత్ కనెక్షన్ లేకపోవడం వల్ల మరుగుదొడ్లు ఉపయోగించడం లేదని తెలిపారు. విద్యుత్ కనెక్షన్ కోసం సంబంధిత శాఖకు దరఖాస్తు చేసి డిపాజిట్ చెల్లిస్తే వారు విద్యుత్ సరఫరా అందిస్తారని, ఆ మేరకు చర్యలు చేపడతామన్నారు.

మామిడి తోటల పెంపకంపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-రామకుప్పం: మామిడి సాగు చేసే రైతులు తగు జాగ్రత్తలు తీసుకొని సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రామకుప్పంలో మామిడి రైతులతో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మామిడి కొమ్మలు కత్తిరింపులు వల్ల జరుగు ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఎరువులు, దుక్కులు దున్ను కోవడం, నీటి తడులు అందివాలన్నారు. అక్టోబర్ లోపు పూత వచ్చినప్పుడు మరోసారి దుక్కులు చేసుకుని సూక్ష్మ పోషకాలు చేపట్టాలన్నారు. తగిన మోతాదులో ఎరువులు వాడడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, నరసింహులు, మునస్వామి, చిన్నికృష్ణ, నాగభూషణం, సీతాపతి, గంట్లప్ప గౌడ్, రామకృష్ణప్ప, విశ్వనాథ్, సుబ్రి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తాం..

- సహపంక్తి భోజనంలో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఐరాల: విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. మంగళవారం ఐరాల మండలంలోని అగరంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం అందించే భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే భోజనం తిన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఒక్క ప్రజాప్రతినిధిగా ఎలాంటి సహాయ సహకారం కావాలన్న తానొక ఎమ్మెల్యేగా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీసే గొప్ప నైపుణ్యం కలిగిన వారే ఉపాధ్యాయులని, అంతే కాకుండా విద్యార్థుల స్థితిగతులను, సామర్థ్యాన్ని గుర్తించగలిగే శక్తి కేవలం ఉపాధ్యాయుల్లో మాత్రమే ఉందన్నారు. ఏ ఒక్క విద్యార్థి చదువుకు పేదరికం శాపం కాకూడదనే ఉద్దేశంతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను అన్ని సౌఖర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటుగా, ప్రభుత్వ అందిస్తున్న భోజనం నాణ్యమైనదిగా ఉందని, ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు మరికొన్ని రకాల ఆహారం అందించేందుకు దాత మధుసూదన్ రావు లాంటి వారు ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమల: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో శుభదిన్ భోజన్ క్రింద సహపంక్తి భోజనాలు చేశారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల విద్యాశాఖ అధికారులు శ్రీరాములు, శివ రత్నమ్మ సోమల ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ఎల్లయ్య, జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హరినాథ్‌లు విద్యార్థులతో కలసి భోజనం తిన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం

చిత్తూరు జిల్లాకు విచ్చేసిన రాజస్థాన్ రైతులు

ప్రజాశక్తి-రామకుప్పం, శాంతిపురం: చిత్తూరు జిల్లాలో ఆటల్ భూజల్ యోజన రాజస్థాన్ బృందంనకు చెందిన ఏడుగురు వ్యవసాయ అధికారుల బృందం, ఆరుగురు రైతుల బృందం జిల్లాలో ఏడు రోజులు పర్యటించనున్నారు. ప్రకృతి వ్యవసాయసాగు పద్ధతులు, వివిధ రకాల పంట పొలాలను బృందం పరిశీలించడానికి వచ్చారు. అందులో భాగంగా మంగళవారం ఈ బృందంతో పాటు జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు రామకుప్పం మండలంలోని విజలాపురం పంచాయతీలోని అంకిరెడ్లపల్లి గ్రామంలో మల్బరీలో 42రకాల కూరగాయలు, పండ్ల మొక్కల మోడల్‌ను పరిశీలించి ఉపయోగాలను తెలుసుకున్నారు. ఏ-గ్రేడ్, ఏటీఎం, పీఎండిఎస్ పొలాలను సందర్శించి వాటి విధానాన్ని, వాటి ఉపయోగాలు తెలిపారు. ఏ-గ్రేడ్, పీఎండీఎస్, ఎన్‌పిఎం షాప్ కేటిల్ షెడ్ ఉపయోగాలు వరిలో డ్రమ్ సీడ్ విధానంను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం గురించి రాజస్థాన్ బృందం వారు ఇక్కడి రైతులతో చర్చించారు. అదేవిధంగా శాంతిపురం మండలంలోని జంగలపల్లి గ్రామంలో రైతు సత్యనారాయణ పొలంలో పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీ ఎల్ శ్రీనివాసులు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు, ఎన్ఎఫ్‌ఓ గురుప్రసాద్, వ్యవసాయ పరిశోధకురాలు పుష్ప, రాష్ట్ర స్థాయి అధికారి కల్పన, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపిన 17మందికి జరిమానా

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరంలో డ్రింక్ డ్రైవ్‌పై పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. కాగా సోమవారం నగరంలో ట్రాఫిక్ ఇన్స్‌స్పెక్టర్ నిత్యబాబు విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. తప్ప తాగి వాహనం నడిపిన 17మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరిని మంగళవారం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్డులో హాజరుపరిచారు. జడ్జి ఉమాదేవి 17మంది వాహనదారులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.1.70లక్షలు జరిమానా విధించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంట

ప్రజాశక్తి -నాయుడుపేట: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంట , అధికారం పొందవచ్చుని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి కే శ్రీనివాసరావు అన్నారు. నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంలో ఆయన రైతులను కలిసి ప్రకృతి వ్యవసాయం గురించి వివరించారు. ఆయన మాట్లాడుతూ తెలికపాటి కషాయాలతో వ్యవసాయం చేయడం వల్ల పంటలో నాణ్యత , ఆరోగ్యం లభిస్తుందని ఇప్పుడున్న ఈ పొల్యూషన్ లో ఇలాంటి వ్యవసా యాలు అందరూ నేర్చుకోవాలని తద్వారా సమాజానికి మంచి ఆహార పంటలను అందించవచ్చని తెలిపారు. పంటలకు రైతులకు అనుగుణమైన వ్యవసాయం చేసేందుకు బ్రహ్మాస్త్రం,నీమాస్త్రం,అగ్ని అస్త్రం ముల గురించి రైతులకు క్షుణ్ణంగా వివరించారు. నాయుడుపేట మండలం వ్యవసాయ అధికారి జె. గణేష్ మాట్లాడుతూ ప్రతి రైతు తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని, ఎక్కువ రసాయన ఎరువులను వాడకుండా పశువుల ఎరువులు పచ్చి రొట్ట ఎరువులను సాగు చేసి భూమిని కలియదున్ని భూమి నాణ్యతను పెంపొందించాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండలం వ్యవసాయ ఉన్నతాధికారి కె.శారద పాల్గొన్నారు.

హైస్కూల్లో ఫ్యాన్లు చోరీ

- నలుగురి అరెస్ట్

ప్రజాశక్తి-ఎస్‌ఆర్ పురం: పాఠశాలలో ఫ్యాన్, గ్యాస్ సిలిండర్ చోరీకి పాల్పడ్డ నలుగురు నిందితులను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ రాజకులాయప్ప మాట్లాడుతూ.. మండలంలోని ఆరి మాకులపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత నెల జూన్ 5వ తేదీ రాత్రి 24 సీలింగ్ ఫ్యాన్లు, రెండు గ్యాస్ సిలిండర్లను దుండగులు ఎత్తుకెళ్లినట్లు పాఠశాల హెచ్‌ఎం రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. గోపి అతని స్నేహితులు మురళి, జ్యోతి, నాగరాజులు కలిసి పాఠశాల తలుపును పగలగొట్టి చోరీ చేసినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ మేరకు సోమవారం తన సిబ్బందితో కలిసి మెదవాడ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలు ఫ్యాన్ సిలిండర్ను తరలిస్తుండగా వారి దగ్గర సరైన ఆధారం లేకపోవడంతో వారిని పట్టుకుని విచారించామన్నారు. ఆ మేరకు నిందితులను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్ తరలించారు. వారు దొంగలు ఇచ్చిన 21 ఫ్యాన్లను, రెండు సిలిండర్లను రికవరీ చేసి పాఠశాలకు అప్పగించడం జరిగింది. నిందితులని పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడంలో ప్రత్యేక చొరవ చూపిన ఎస్ఐ రాజకుల్లాయప్పను, పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు, ప్రజలు అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-పూతలపట్టు: మండలంలోని రంగంపేట క్రాస్ వద్ద కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఆకనబటి గ్రామానికి చెందిన సాయి (23) ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా పీలేరు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం సంభవించింది. గాయపడిన క్షతగాత్రున్ని 108 సాయంతో చిత్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

In The Court of the Principal Senior Civil Judge of Tirupati
O.S.No..9/2023

T.Parandhama ...Plaintiff
V/s
1) M.Yugandhar, 2) Y.Sindhura ...Defendants

SUIT SUMMONS TO THE DEFENDANTS

D1) M.Yugandhar S/o M.Veeraswamy
D2) Y.Sindhura W/o M.Yugandhar
Both are residing at Dhiguvachowdepalli Village, Paturu Post, Puthalapattu Mandal, Chittoor Dist.

పై దావాను తేది 19.11.2018న 1,2వ ప్రతివాదులు వాదికి వ్రాసి ఇచ్చిన సేల్ అగ్రిమెంట్ ప్రకారము స్పెసిఫిక్ ఫర్‌ఫామెన్స్ (రిజిష్టర్ రెగ్యులర్ సేల్‌డీడ్) కొరకు వేసియున్నారు. సదరు దావా 1, 2 ప్రతివాదులైన మీ యొక్క హాజరు నిమిత్తం కోర్టువారు తేది. 10.09.2024వ తేదికి వాయిదా వేసియున్నారు. సదరు తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కనిన కోర్టుకు నేరులో గాని, వకీలు ద్వారా గాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలసినది. లేని యెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేది. 10.09.2024
ఇరుగు సురేంద్ర
అడ్వకేట్, తిరుపతి. సెల్: 9966688800

పారిశుద్ధ్యం లోపించినా పట్టించుకోరా..

- పన్నూరు పర్యటనలో డీపీవో ఆగ్రహం
- మండల, పంచాయతీ అధికారుల తీరుపై అసహనం
- వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశం
- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని పన్నూరు దళితవాడలో పారిశుద్ధ్యం లోపించింది. చెత్తాచెదారంతో పాటు మురుగు నిల్వతో అస్తవ్యస్తంగా మారిన పరిస్థితి. ఇబ్బడిముబ్బడిగా సమస్యలు నెలకొన్నాయి. ఈ విషయంగా మంగళవారం 'పన్నూరులో పడకేసిన పారిశుద్ధ్యం' శీర్షికన కథనం వెలువడింది. స్పందించిన డీపీవో లక్ష్మీ మంగళవారం మధ్యాహ్నం ఆ గ్రామానికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితులను ఆరాదీశారు. పారిశుద్ధ్యం లోపించి ఉండటం, వీధుల్లో అపరిశుభ్రం, పేరుకు పోయిన మురుగును పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల, పంచాయతీ అధికారులను హెచ్చరించారు. వెంటనే గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఓవర్ హెడ్ ట్యాంక్ క్లోరినేషన్ చేయడంతో పాటు, పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. పంచాయతీలో పారిశుద్ధ్య పనులు జరిగినట్లు ఎక్కడ కనిపించలేదని పంచాయతీ కార్యదర్శుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు అనారోగ్యం పాలవకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందని డీపీవో అన్నారు. ఎంపీడీవో బ్రహ్మయ్య, పంచాయతీ కారదర్శులు సురేంద్ర, బాబు, కానిక రాజ్, రామమూర్తి, నిఖిల్, ఉదయ్, జయప్రకాష్ పాల్గొన్నారు.

పన్నూరులో పారిశుద్ధ్యం పనులు పరిశీలిస్తున్న డీపీవో